మీకోసం గోడ పత్రిక విడుదల

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఈ నెల 12వ తేదీ నుంచి అక్టోబర్ 12వ తేదీ వరకు "మీ కోసం" కార్యక్రమం ద్వారా హెచ్ఐవి/ఎయిడ్స్‌పై నిర్వహించనున్న కార్యక్రమ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డా. పి.జగన్నాథరావు, డిఎల్ ఎటిబి అధికారి డా. పూర్ణేంద్ర బాబు, డీఈఓ ఎల్.చంద్రకళ, డీఆర్డీఏ పీడీ ఎం.శోభారాణి, ఐసీడీఎస్ పీడీ జి.జయదేవి, బిసీ సంక్షేమం, సాంఘిక సంక్షేమ శాఖాధికారులు కె.శ్రీదేవి, కె.రామా రావు, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంసీతో అంత ఈజీ కాదు

సమీక్షలు, పర్యటనలతో అధికారుల్లో కదలిక
ఇది పరీక్షా కాలమే..

విశాలాంధ్ర - విశాఖ: గత కొన్ని సంవత్సరాలుగా పని చేయకుండా కాలక్షేపానికి కార్యాలయానికి వస్తూ వెళ్తున్న వీఎంఆర్డీఏ అధికారులకు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మెట్రోపాలిటన్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ కొరకరాని కొయ్యగా తయారయ్యారు. ఇన్‌చార్జి ఎంసీ హయాంలో కొన్నేళ్లపాటు అధికారులు ఆడుతూ పాడుతూ విధులు నిర్వహించారు. కొన్ని విభాగాలు అయితే పనీపాటా లేకుండా కాలం గడిపేసాయి. కొత్త ఎంసి విభాగాల వారీగా సమీక్షలు నిర్వహించడంతోపాటు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఎప్పటిలాగే ఇప్పుడూ అనుకుంటూ సీరియస్‌గా లేని ఒకరిద్దరు అధికారులకు ఎంసి నుంచి వార్నింగ్‌లు ప్రత్యక్షంగానే అందాయి. సమీక్షలు క్షేత్రస్థాయి పర్యటనలు జరుగుతున్న తీరుతో ఎంసి ఏంటో అధికారులకు ఇప్పటికే అర్థమైంది. గతంలో మాదిరిగా ఆడుతూ పాడుతూ విధులు నిర్వహించే పరిస్థితి ఉండదని అవగతమైంది. కొత్త ఎంసి కెఎస్ విశ్వనాథన్ ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఆదేశాలు ఇస్తున్నారు. ఒక ప్రణాళికతో వీఎంఆర్డీఏని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. గతంలో ఉన్న ప్రతిపాదనలను ఆచరణలోకి తీసుకురావడంతో పాటు కొత్త ప్రాజెక్టుల కోసం ఆలోచిస్తున్నారు. వీఎంఆర్డీఏలో ఒక పరిపాలనాధికారి విఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లోనే ఆయన ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. ఇంతలోనే వీఆర్ఎస్‌కి దరఖాస్తు చేయడానికి కారణాలను చెప్పాలని ఎంసి ఆదేశించినట్టు తెలిసింది. హరిత ప్రాజెక్ట్ సమీపంలో ఐటి పార్క్, కైలాసగిరి అభివృద్ధి, ఎంఐజి లేఔట్‌లు, ఆడ్ బిట్ల వేలం, సొంత లే అవుట్ అభివృద్ధి, మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణం, వాణిజ్య సముదాయాల్లోని దుకాణాల అద్దె బకాయిలు అంశాలపై ఎంసీ దృష్టి సారించారు. అయితే వీఎమ్మార్డీఏలో ఐటీ విభాగాన్ని పటిష్ట పరచవలసిన అవసరం ఉంది. కంప్యూటర్ల నిర్వహణ లేక తరచూ మొరాయిస్తున్నాయి. వీఎంఆర్డీఏ అటవీ విభాగంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొని ఉంది. ఈ విభాగంలో గతంలో అనేక స్కామ్‌లు జరిగాయి. ఇక్కడ అవినీతికి

పాల్పడిన డీఎఫ్ఓ అటవీ శాఖకు వెళ్లి ఏసీబీకి దొరికిపోయాడు. మొక్కలు, పచ్చదనం పేరుతో లెక్కలు తప్పించే ఈ విభాగంపై ఎంసీ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఇంజనీరింగ్, ప్రణాళికా విభాగాల్లో సిబ్బంది కొరత ఉంది. ప్రభుత్వం ఎల్ ఆర్ ఎస్, బిపిఎస్‌లను పునరుద్ధరించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఇదే జరిగితే ప్రణాళిక విభాగంలో పని ఒత్తిడి ఉంటుంది. అందుకు తగ్గట్టుగా సిబ్బంది ఉండాల్సిన అవసరం ఉంది. వీఎంఆర్డీఏ విలీన ప్రాంతాల్లో అనధికార లే అవుట్లపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

వీసీని అభినందించిన అడిషనల్ ఎస్పీ

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావును స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ డి.గంగాధరరావు మర్యాదపూర్వకంగా కలిసారు. వీసీ ఆచార్య శశిభూషణ రావుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి డి.రమేష్ తమ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి, స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు ఏఈఓ ఆనంద్ కుమార్ అందజేశారు. స్వామివారికి ఒడిస్సా భక్తుడు దాసుడు స్వామివారి ప్రసాదాలకు ఇత్తడి పాత్రలను విరాళంగా అందజేశారు.

సోములకు వీరాభిమన్యు పురస్కారం

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విశాఖపట్నం సిటీ వైడ్ శోభన్‌బాబు ఫాన్స్ ఆధ్వర్యంలో శోభన్‌బాబు తొలిసారి టైటిల్ రోల్‌లో హీరోగా నటించిన తొలిచిత్రం వీరాభి మన్యు 60వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా కీర్తిశిఖరం పేరిట జాగరపు త్రిమూర్తులు రచించిన పుస్తక ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా జీవీఎంసీ కార్పొరేటర్ బిపిన్ జైన్ హాజరయ్యారు. హైదరాబాద్ చెందిన శోభన్‌బాబు వీరాభిమాని, చలనచిత్ర రంగ నంది అవార్డుల మాజీ జ్యూరీ సభ్యులు చల్లగాలి వెంకట రాజు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. గత పదహారేళ్లుగా శోభన్‌బాబు జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్న అభిమానులను ఈ సందర్భంగా శ్రీనుబాబు అభినందించారు. ముఖ్యంగా మూడు దశాబ్దాలకు పైగా సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎన్నో పురస్కారాలు, సన్మానాలు పొందిన శోభన్ బాబు వీరాభిమాని నందవరపు సోములును ముఖ్య అతిథులు ప్రత్యేకంగా ప్రశంసించి అభినందించారు. ఈ సందర్భంగా విశాఖ శోభన్ బాబు అభిమానులు "శోభన్ బాబు వీరాభిమన్యు" పురస్కారంతో సోములును ముఖ్య అతిథుల చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో విశాఖ అభిమానులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన అభిమానులు కూడా పాల్గొన్నారు.

ప్లాంట్ పరిరక్షణకు విఘాతం కల్పించే శక్తులకు గుణపాఠం చెబుదాం

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: ప్లాంట్ పరిరక్షణకు విఘాతం కల్పించే శక్తులకు గుణపాఠం చెబుదామని ఉక్కు పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న దీక్షలు 1278వ రోజుకు చేరుకున్నాయి. పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, వరసల శ్రీనివాసరావు, రమణ, దిండుమోహన్, జీవీ సుబ్బయ్య, కర్రి గోవిందరాజు, పెంట అప్పారావు, పులి చంద్రశేఖర రావు, డి.శ్రీనివాస్, నేలతేటి రాజు, ఎస్సీ నాయుడు తదితరులు పాల్గొని మాట్లాడారు. విశాఖ ఉక్కు ఊపిరి ఆపాలని కేంద్ర ప్రభుత్వం యాజమాన్యం ప్రయత్నం చేయడం దుర్మార్గం అన్నారు. ఈ పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ఉదారంగా పంచవర్ష ప్రణాళికలో ఇచ్చింది కాదని ఎందరో మహనీయులు పోరాటాలు త్యాగాలు బలిదానాలు ద్వారా వచ్చిందన్నారు. ప్లాంటు ప్రస్తుతం వెంటిలేటర్‌పై ఉందని, ఏ సమయంలోనైనా ప్రమాదాలు జరిగేందుకు అవకాశం పొంచి ఉందని సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతుందన్నారు. ఇప్పటికీ కార్మికులు అనేక ఆర్థిక ప్రయోజనాలు కోల్పోయారని, లాభాల్లో ఉన్న కంపెనీ బిజెపి పాలనలో నష్టాలకు నెట్టబడిందని అన్నారు.

గ్రంథాలయ శాస్త్ర పితామహుడు రంగనాథం జయంతి వేడుకలు

విశాలాంధ్ర - పెందుర్తి: గ్రంథాలయ శాస్త్ర పితామహుడు బేత రామ రంగనాథం 132వ జయంతి వేడుకలు పెందుర్తి శాఖ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి బత్తిన సూర్యకళ రంగనాథం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయ వృత్తికి ఆదర్శప్రాయుడు రంగనాథం అని, ఆయన ప్రవేశపెట్టిన కోలన్ క్లాసిఫికేషన్ అనేక ప్రపంచ దేశాలలో వినియోగింపబడుతుందని పేర్కొన్నారు. దీనివల్ల పుస్తకాలు తీసుకొనుట సులభతరంగా మారిందన్నారు. ఆయన ప్రవేశపెట్టిన పంచ సూత్రాలు గ్రంథాలయాలకు తలమానికంగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో చదువరులు, విద్యార్థులు, జగదీష్ మాస్టర్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మల్కాపురం: ఎస్.ఆర్.రంగనాథన్ సేవలు స్ఫూర్తిదాయకం అని, ప్రతి ఒక్కరు ఆయన చెప్పిన విధంగా గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట్రావు అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్.ఆర్. రంగనాథన్ జయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ లైబ్రరీ సైన్స్‌కు ఒక గుర్తింపు తెచ్చి, దానికి పితగా అవతరించిన వ్యక్తి డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ అని అన్నారు. లైబ్రరీ సైన్స్‌లో క్యాటలాగ్ పద్ధతిని ఆయన ప్రవేశపెట్టారని, నేటి అపార విజ్ఞానాన్ని జాగ్రత్తగా నిక్షిప్తం చేయడానికి ఆయనే కారకుడని ఆయన అన్నారు. అనంతరం జిల్లాలోని వివిధ గ్రంథాలయాల అధికారులను ఆయన అవార్డులతో సత్కరించారు. కార్యక్రమానికి మల్కాపురం శాఖా గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి. ఎస్.భాగ్య లక్ష్మి, సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి, ప్రముఖ కవి కె.సత్తిరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఉపాధ్యక్షులు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపాలి

ఏఐటీయూసీ నేత వామనమూర్తి డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో నష్టపోయిన ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఆదాయం చూపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ గాంధీ బొమ్మ దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యంపై పునరాలోచించాలని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం వల్ల నష్టపోయిన ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఆర్థిక ఆదాయం చూపించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డుల అభివృద్ధి పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో టోల్ గేట్లు పెట్టాలన్న ప్రతిపాదనను వెంటనే విరమించాలని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న విజయనగరం జిల్లా జొన్నాడ టోల్‌గేట్‌ను, విశాఖ జిల్లా అగనంపూడి టోల్‌గేట్‌లను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దశలవారీగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే జరిమానాలు పెంచే జీవో నెంబర్ 21, 31 రద్దు చేస్తామని, డీజిలు, పెట్రోల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తెచ్చి ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని, బాడ్జ్ ఉన్న డ్రైవర్లకు 15000 రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చి మూడు నెలలు గడిచినా ఒక్కటి అమలు చేయలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఆటో అండ్ మోటార్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద, ఎన్.మధు రెడ్డి, గాజువాక ఆటో స్టాండ్ ప్రెసిడెంట్ చంటి, అప్పలరాజు, రావికృష్ణ, అద్దూరి శంకర్, ఎస్.చెన్నారెడ్డి, కొల్లి సన్యాసిరావు, నూకరాజు, ఎం.అప్పలనాయుడు, ఎల్.గోవిందు, బంగారయ్య, వై.వెంకట్, ఎంపి ఖాన్, అప్పలరాజు, లక్ష్మణరావు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్‌కు ఘనమైన పోరాట చరిత్ర

విశాలాంధ్ర - విశాఖ : ఏఐఎస్ఎఫ్‌కు దేశంలో ఘనమైన పోరాట చరిత్ర ఉందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.నాగరాజు అన్నారు. ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలో ఉన్న ఎస్సీ కాలేజ్ బాలికల హాస్టల్ విద్యార్థుల సమక్షంలో ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాక పూర్వమే ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో 1936 ఆగస్టు 12 న ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందని తెలిపారు. తొలి రోజుల్లో బ్రిటిష్ సామ్రాజ్యవాదులను దేశం నుంచి తరిమికొట్టే ఉద్దేశంతో యువతీ, యువకుల్లో దేశభక్తి మెండుగా నింపిందని పేర్కొన్నారు. ఆనాటి ఉద్యమాలలో సంఘానికి సంబంధించిన ఎంతో మంది యువకులు దేశం కోసం ప్రాణాలర్పించారని చెప్పారు. పోరాటాలు, త్యాగాలే ధ్యేయంగా ఏర్పాటైన ఏఐఎస్ఎఫ్ స్వాతంత్ర్యానంతరం శాస్త్రీయ విద్యావిధానం అమలుపై నిరంతరం పోరాటాలు సాగిస్తోందని తెలిపారు. పేద విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం, స్కాలర్‌షిప్‌ల మంజూరు, కాస్మొటిక్ ఛార్జీల పెంపు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై నిరంతరం పోరాటాలు సాగిస్తోందని అన్నారు. ఐక్య ఉద్యమాలను నిర్మించి, కలిసి వచ్చే ఇతర సంఘాలతో విద్యార్థుల సమస్యల పట్ల దూసుకుపోతోందని చెప్పారు. "చదువుతూ పోరాడు.. పోరాడి సాధించు.." నినాదంతో విద్యార్థులకు మరింత చేరువవుతోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను చీల్చిచెండాడుతూ సమరశీల పోరాటాలను కొనసాగిస్తూ సమస్యల సాధన కోసం విశేషంగా కృషి చేసిన ఘనత ఏఐఎస్ఎఫ్‌కే దక్కుతుందని చెప్పారు. రాష్ట్ర, కేంద్ర బడ్జెట్‌లలో విద్యకు ఎక్కువ నిధులు కేటాయించి, విద్య సామాన్యులకు అందుబాటులో ఉండాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వాలకు పలుమార్లు కనువిప్పు కలిగించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎన్ శ్రీను, జిల్లా సమితి సభ్యులు గ్రేస్ ప్రకాష్, వెంకట రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా నామినేషన్ దాఖలు చేసిన షేక్ షఫీ

విశాలాంధ్ర - పెందుర్తి: ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీ ఉల్లా నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు తన నామినేషన్ పత్రాలను అందజేశారు. గతంలోను షఫీ పలు ఎన్నికల్లో పోటీ చేస్తూ వస్తున్నారు.

తెన్నేటి పార్కును పరిశీలించిన ఎంసీ

విశాలాంధ్ర - విశాఖ: వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ సోమవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా తెన్నేటిపార్కును సందర్శించారు. అక్కడి బిగ్ స్క్రీన్ స్టేజి పరిసరాలను చక్కటి కళాకృతులతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది సందర్శకులను ఆకర్షించే విధముగా

తీర్చిదిద్దాలని ఆదేశించారు. పార్కును పచ్చదనంతో నింపాలని, చెత్త కుండీలను ఏర్పాటు చేసి చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని సూచించారు. నడకదారులు, గోడలకు ఉన్న పాడైన టైల్స్‌ని తక్షణం మార్చాలని ఆదేశించారు. గోడలకు చక్కని థీమ్‌తో పెయింటింగ్ వేయించాలని, పాడైన గార్డెనింగ్, విద్యుత్ దీపాలు, బెంచిలను మార్చి సందర్శకులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. హ్యాండ్ రెయిలింగ్‌కి జరుగుతున్న మరమ్మతులను పరిశీలించారు. తరువాత బీచ్ రోడ్డులో ఉన్న సీ హారియర్ మ్యూజియాన్ని సందర్శించారు. అక్కడ విద్యుత్ స్తంభాలకు ఉన్న తుప్పును తొలగించి పెయింటింగ్ వేయించాలని, సందర్శకులకు తాగునీరు, మెరుగైన పారిశుధ్యం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజనీర్ భవానీశంకర్, డివిజినల్ ఫారెస్ట్ అధికారి శాంతి స్వరూప్, పర్యవేక్షక ఇంజనీర్ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజనీర్లు రాజు, రామరాజు, రేంజ్ ఆఫీసర్ శ్యామల, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ మురళి, మోహనరావు, సహాయక ఇంజనీర్ హసీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

లీగల్ సెల్ అధారిటీ ఆధ్వర్యంలో న్యాయ సేవలపై అవగాహన

విశాలాంధ్ర - సింహాచలం: సింహరిపై గిరిజన గ్రామంలో విశాఖ లీగల్ సెల్ అధారిటీ ఆధ్వర్యంలో న్యాయ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ సెల్ కార్యదర్శి జస్టిస్ వెంకట శేషమ్మ మాట్లాడుతూ గిరి పుత్రుల్లో విద్య ప్రాధాన్యాన్ని, గిరిజన మహిళల సాధికారతను ప్రస్తావించారు. గిరిజనుల అభ్యున్నతికి, హక్కుల పరిరక్షణకు, సాధికారత కోసం చేయాల్సిన కృషిని వివరించారు. గిరిజన మహిళల అభ్యున్నతి అనే అంశం మీద ఆమె ప్రసంగించారు. పౌష్టికాహార లోపం, మాతాశిశు మరణాల తగ్గింపు, పేదరిక నిర్మూలన లాంటి సమస్యల పరిష్కార దిశలో వారిని ప్రోత్సహించాల్సి ఉందని అన్నారు. ఆరోగ్య రక్షణ కోసం శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేసి వారికి విధి, విధానాలు చెబుతూ రిజిస్టర్ పెట్టమని సూచనలు చేశారు.

ఎమ్మెల్సీ స్థానానికి రెండు నామినేషన్లు
మూడు సెట్లు సమర్పించిన బొత్స, ఒక సెట్ అందజేసిన ఇండిపెండెంట్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: స్థానిక సంస్థల కోటాలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానానికి ఆరో రోజు రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. సోమవారం మధ్యాహ్నం 1.45 గంటలకు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కలెక్టరేట్‌కు చేరుకొని ఆర్వో కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌కు మూడు సెట్లు నామినేషన్ పత్రాలు సమర్పించారు. బొత్స వెంట ఆయన సతీమణి ఝాన్సీ, అరకు ఎంపీ తనూజ రాణి, మాజీ మంత్రి బూడి ముత్యాల నాయుడు, విశాఖ నగర మేయర్ హరివెంకట కుమారి ఉన్నారు. నామినేషన్ దాఖలు చేసిన వెంటనే సంప్రదాయం ప్రకారం బొత్స సత్యనారాయణ ప్రమాణం చేశారు. అదే విధంగా షేక్ షఫీ ఉల్లా స్వతంత్ర అభ్యర్థిగా సోమవారం మధ్యాహ్నం 1.00 గంటకు తన మద్దతుదారులతో కలిసి వచ్చి ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. ఒక సెట్ పత్రాలను ఆర్వోకి అందజేశారు.

డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం నీలకుండీలు జంక్షన్‌లో గల శ్రీ సాయి స్వామి వివేకానంద పాఠశాలలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు అధ్యక్షతన సోమవారం డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ నాసా ముక్తి భారత్ అభియాన్ క్రింద ఐక్యంగా ఉండి సమాజం, కుటుంబం, స్నేహితులు మాత్రమే కాకుండా మేము కూడా డ్రగ్స్ రహితంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ లెంక సురేష్ మాట్లాడుతూ నాసా 5వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణంపై పునః పరిశీలించాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర - విశాఖ: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై రాష్ట్ర ప్రభుత్వం పునః పరిశీలన చేయాలని విశాఖపట్నం జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (ఏఐటీయూసీ) నాయకులు సోమవారం విశాఖ తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణ బాబుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు షేక్ రెహమాన్, ప్రధాన కార్యదర్శి సిహెచ్. కాసుబాబు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల ఆటోలుకు బేరాలు లేక డ్రైవర్లు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. ఇప్పటికే ఓలా, ఊబర్, రాపిడోల వల్ల బేరాలు లేక డ్రైవర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అంటే బేరాలు పూర్తిగా తగ్గిపోతాయని అన్నారు. ఆటో, మోటార్ డ్రైవర్లకు సొసైటీ ఏర్పాటు చేసి, డీజిల్, పెట్రోల్, నిత్యావసర వస్తువులను సబ్సిడీ ధరలకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రమాదాల నివారణ పేరుతో జారీ చేసిన 894 గెజిట్ నోటిఫికేషన్, దానికి అనుసంధానంగా గత వైసిపి ప్రభుత్వం జారీ చేసిన జీవో 21 వల్ల వందల్లో ఉన్న ఫైన్లు వేలల్లోకి పెరిగాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు జీవో నెంబర్ 21 ద్వారా రాస్తున్న ఫైన్లను తగ్గిస్తానని హామీ ఇచ్చిన అంశాన్ని గుర్తు చేశారు. ఫైన్లను తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మధ్యకాలంలో ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసులు కేసుల మీద కేసులు రాస్తున్నారని, దీని వల్ల ఆటో డ్రైవర్లు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని తెలిపారు. జీవో నెంబర్ 21ని వెంటనే రద్దుచేసి ఆర్టీఏ, పోలీసులు పెట్టిన కేసులను ఎత్తివేయాలని, పెండింగ్‌లో ఉన్న ఇ-చలానా కేసులను తగ్గించాలని, ఆటో అండ్ మోటార్ కార్మికులకు భద్రతతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.సాయి, పి.రాము, పి.బాలాజీ, శ్రీను, సూర్యనారాయణ గోవింద కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

In The Court of The IV Addl Junior Civil Judge at Vijayawada
O.S. No. 2424/2022

Between :
Canara Bank (Erstwhile Syndicate Bank)
Rep by its Chief Manager
Labbipet Branch, Vijayawada
--- Plainfiff

And

G.Naga Surya Charan
And 3 Others --- Defendants
Defendant No 4 : G.V.Koteswara Rao
S/o Sita Ramaiah, R/o D.No. 11-93-2, Akkireddy Palem GHDV Post, 65 Ward, Pedagantyada, BHPV, Visakahapatnam

పై నెంబరు దావాలో నాల్గవ ప్రతివాది అయిన మీకు పై దావా సమన్లు పంపగా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పత్రికా ప్రచురణ ద్వారా సదరు దావా సంగతులు తెలియచేయవలసినదిగా పై కోర్టువారు ఆదేశించియున్నారు. కావున **తేది : 29-08-2024వ తేదీన** ఉదయం గం. **10:30** నిమిషములకు శ్రీ పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని లేదా మీ న్యాయవాది గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా : 29-08-2024

BSNK LAW ASSOCIATES
B.Suryanarayana Kumar, B.Com, B.L, (BSNK)
B.Sai Krishna Karthik, MBA, L.L.B (BSKK)
32-15-104, 1st Floor, 0-1, Classic Towers, Ratnamamba Street, Moghalrajpuram, Vijayawada-10
Cell : 98480 17859, 81859 56019
విజయవాడ : 12-08-2024

మనిషి జీవనానికి వ్యవసాయం ప్రధమ ఆధారం

గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం

విశాలాంధ్ర - ఆనందపురం: రైతులను గౌరవించడం ప్రతి ఒక్కరు బాధ్యత అని భూమి మీద ప్రప్రథమంగా మొదలైన వృత్తి వ్యవసాయం అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం అన్నారు. సోమవారం ఉదయం విశాఖపట్నంలోని ఇంటెల్లి విద్యార్థులతో ఆనందపురం మండలం చందక గ్రామంలో శంకర్, మోహన్ అనే రైతులకు చెందిన పొలాల్లో వరి నాట్లు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటెల్లి విద్యా సంస్థ చాలా కాలంగా విద్యార్థులకు ప్రకృతి ఆధారిత వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ కోసం అవగాహన కల్పించేందుకు కృషి చెయ్యడం అభినందనీయం అన్నారు. పది వేల సంవత్సరాల క్రితం వ్యవసాయం ప్రారంభం అయ్యిందన్నారు. రైతులు వ్యవసాయం చేస్తున్నారు కాబట్టే మనం మూడు పూటలా భోజనం చేయగలుగు తున్నామని వివరించారు. అందుకే మనకు ఆహారాన్ని అందించే రైతును గౌరవించడం మన కర్తవ్యం అని, ప్రతీ ఒక్కరూ తెలుసుకుని గౌరవించాలన్నారు. రైతులు కష్టించి పనిచేసి పంటలు పండిస్తేనే మనం హాయిగా జీవిస్తున్నాం అనేది ప్రతి ఒక్కరూ తెలుసుకుని జీవించాలని కోరారు. అందుకే విద్యార్థులంతా వ్యవసాయం చేయడం కూడా నేర్చుకోవాలని, వ్యవసాయం చేయడం వల్ల సహనం, నిబద్ధత, అందరితో కలిసిమెలిసి జీవించడం, సమయపాలన, కలుపు గోరు తనం, పరిపాలనా దక్షత, సమస్త జీవులను కాపాడుకునే తత్వం, మొక్కలను పెంచుకోవాలనే ఆలోచన ఇలా చాలా అంశాలు ముడిపడి ఉంటాయని పేర్కొన్నారు. చిరాకు, చికాకు అనేవి కానరాకుండా పోతాయని, భూమినీ, గాలినీ, నీటినీ, ఆహారాన్నీ గౌరవించాలి అనే విషయం తెలుస్తుంది అన్నారు. ఏ ఒక్కరూ తాము తినే ఆహారాన్ని వృధా చేయరాదని, ఆహారం వృధా చేయకుండా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీచింగ్ ఫ్యాకల్టీ జయశ్రీ, శ్రీలత, మాధురి, సత్యవతి, కృష్ణ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీఓ వాలంటీర్లు జెనపరెడ్డి రవితేజ, ఇళ్ళ కృష్ణ కుమారి, చిత్రకారుడు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన ఆహార పదార్థాలతో వంటకాలు

తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరంలో హెూటల్లో, రెస్టారెంట్లలో పాచిపోయిన పదార్థాలు, కుళ్ళిపోయి కంపు కొడుతున్న మాంసాహార ఉత్పత్తులను జీవీఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారి జీవి అప్పారావు సోమవారం తనిఖీ చేశారు. రామ్ నగర్‌లోని ఇన్నోసెంట్ బ్యాచిలర్, ఫ్యామిలీ రెస్టారెంట్లో తనిఖీలు చేపట్టారు. గ్రీన్ వ్యాలీ రెస్ట్ కేఫ్‌లో సుమారు 10 కేజీల నిల్వ ఉంచి పాడైపోయిన ఆహార పదార్థాలను తనిఖీ చేసి సీజ్ చేశారు. చికెన్, మసాలా పెప్స్ వంటి పదార్థాలను గుర్తించి ఆ సంస్థలపై కేసులు నమోదు చేశారు. వీటిని ల్యాబ్‌కు పంపించి నివేదికలు వచ్చాక కేసులతో పాటు పెనాల్టీ వేస్తామని ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలియజేశారు. అనేక రెస్టారెంట్లలో, హెూటల్లో ఇదే తరహా జరుగుతుందని ప్రజలు కూడా పెద్ద ఎత్తున ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను వెంటనే వేడి చేసి హెూటల్‌కు వచ్చే వినియోగ దారులకు అందజేయడంతో తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులు తెలిపారు. సరదాగా ఫ్యామిలీతో బయట భోజనం చేయాలంటే భయమేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. అన్ని ఆహార పదార్థాల్లో కల్తీలతో పాటు, ఫ్రిడ్జిల్లో నిల్వలు ఉన్న ఆహార పదార్థాల్ని అత్యధికంగా వినియోగిస్తున్న తీరుపై నిరంతరం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డిసెంబర్ 15న వైజాగ్ నేవీ మారథాన్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: డిసెంబర్ 15న వైజాగ్ నేవీ మారథాన్ జరగనుంది. మారథాన్ కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. సోమవారం విలేకరుల సమావేశంలో జివిఎంసి కమీషనర్ పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ వైజాగ్ నేవీ మారథాన్ కేవలం క్రీడా కార్యక్రమం మాత్రమేనని ఉద్ఘాటించారు. ప్రపంచ స్థాయి ఈవెంట్‌లో తమను తాము సవాలు చేసుకుంటూ విశాఖపట్నం యొక్క అద్భుతమైన ప్రకృతి దృశ్యాలను వీక్షించడానికి ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. నూతనంగా అభివృద్ధి చేసిన వెబ్‌సైట్, రిజిస్ట్రేషన్ వివరాలను వెల్లడించారు. ప్రదీప్ పటేల్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలిని స్వీకరించడానికి పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. ప్రతి నెలా మొదటి ఆదివారం డాల్ఫిన్ హిల్ మరియు ఆర్‌కె బీచ్‌లో వీఎన్ఎం కోసం కండిషనింగ్ స్ట్రెంగ్త్ ట్రెనింగ్ ప్రోగ్రామ్‌తో పాటు ప్రోమో రన్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఈవెంట్ నేవీ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా ఉందన్నారు. 42కె, 21కె, 10కె మరియు 5కెలు నిర్వహించబడతాయని తెలిపారు.

పాసింజర్ ఆటోనా..? గూడ్స్ ఆటోనా..?

నిబంధనలు తుంగలో తొక్కిన ఆటోవాలా

విశాలాంధ్ర - ఆనందపురం: పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా ఆటో వాళ్ళ నిర్లక్ష్య ధోరణి కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని పలువురు విమర్శిస్తున్నారు.

మండలంలో మహాత్మా గాంధీ పూల మార్కెట్ నుండి ప్రతిరోజు పలు ప్రాంతాలకు వెళ్లే పాసింజర్ ఆటోలు ప్రమాదగంటికలు మోగిస్తూ పరిధికి మించిన లోడింగ్ చేస్తూ ప్రయాణాలు సాగుస్తున్నారు. పాసింజర్ ఆటోలు గూడ్స్ బండిలా మార్చి అధికలోడుతో ప్రయాణం చేసే క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే నష్ట తీవ్రత అంచనాలు వేయడం కష్ట సాధ్యం. ప్రమాదాలు జరగకముందే సంబంధిత ఉన్నతాధికారులు పాసింజర్ ఆటోలను గూడ్స్ బండ్లగా తయారుచేసిన ఆటోవాలాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ పలువురు నెటిజన్లు కోరుతున్నారు.

యే సైన్స్ హై పేరుతో చికెన్ పాక్స్, షింగిల్స్‌పై జీఎస్‌కే అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర - విశాఖపట్నం: చికెన్ పాక్స్, షింగిల్స్ (సర్పి) పట్ల ప్రజల్లో అవగాహన పెంచేందుకు గ్లాస్ కో స్మిత్లైన్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ జీఎస్‌కే నూతన ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ప్రచార కార్యక్రమాన్ని ప్రముఖ నటులు అమితాబ్ బచ్చన్, మనోజ్ పహ్వా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు. చికెన్‌పాక్స్, షింగిల్స్ (సర్పి) మధ్య శాస్త్రీయ సంబంధాన్ని వివరిస్తున్నారు. ఈ ప్రచార చలన చిత్రాలు సర్పి గురించి మాట్లాడటానికి ఇద్దరు స్నేహితుల మధ్య రోజువారీ సంభాషణలను ఉపయోగించుకుంటాయి. మధుమేహం ఉన్నవారిలో షింగిల్స్ పెరిగేందుకు ఉన్న అవకాశాలను సైతం చర్చిస్తాయనీ జీఎస్కే ప్రతినిధి పేషెంట్ ఎంపవర్‌మెంట్ హెడ్ విగ్యేతా అగర్వాల్ వెల్లడించారు. 50 ఏళ్లు పైబడిన పెద్దలను షింగిల్స్, దాని నివారణ గురించి తమ వైద్యులతో మాట్లాడమని ప్రోత్సహిస్తున్నాను అని అన్నారు. ఒక వ్యక్తికి చికెన్‌పాక్స్ ఉంటే వారి శరీరం లో నిద్రాణమైన వైరస్ తిరిగి క్రియాశీలం కావడం వల్ల షింగిల్స్ వస్తుందనీ, మధుమేహం కలిగి, చికెన్‌పాక్స్ చరిత్ర కలిగిన వ్యక్తులకు షింగిల్స్ అభివృద్ధి చెందే ప్రమాదం 40 శాతం ఎక్కువ అన్నారు. రక్తంలో అధిక చక్కెర స్థాయిలు రోగ నిరోధక శక్తిని బలహీనపరుస్తాయనీ, రోగ నిరోధక శక్తి తగ్గినప్పుడు చికెన్‌పాక్స్ వైరస్ క్రియాశీలకంగా మారటం తో పాటుగా షింగిల్స్ ఏర్పడే ప్రమాదాన్ని పెంచుతుందని చెప్పారు.

భారీ పెట్టుబడి సేకరణ సాధించిన కైనటిక్ గ్రీన్

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశానికి చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల (ఈవి) తయారీదారు సిరీస్ ఏ నిధుల సేకరణలో భాగంగా భారీ పెట్టుబడి సేకరణ విషయాన్ని వెల్లడించింది. మొత్తం 40 మిలియన్ అమెరికన్ డాలర్ సేకరణలో భాగంగా పేరెన్నికగన్న అంతర్జాతీయ ప్రైవేటు ఈక్విటీ సంస్థ, (గ్రేటర్ పసిఫిక్ క్యాపిటల్) నుంచి 25 మిలియన్ అమెరికన్ డాలర్లను సేకరించినట్లు తెలిపింది. కైనటిక్ గ్రీన్ 2016లో ఈవి రంగంలోకి ఒక మార్గదర్శక ఈవీ ఓఏంఈ ప్రవేశించింది. సంస్థకు కైనటిక్ గ్రూప్ వ్యవస్థాపకులు ఫిరోడియా కుటుంబంలోని మూడవ తరం సభ్యుడు సులజ్జా ఫిరోడియా మోత్వాని నాయకత్వం వహిస్తున్నారు. కైనటిక్ గత 50 సంవత్సరాలుగా భారతదేశ వాహన రంగంలో ప్రముఖ తయారీదారు మరియు ఆవిష్కర్తగా ఉంది మరియు కైనటిక్ లూనా మరియు కైనటిక్ హెూండాతో సహా ప్రసిద్ధ ఉత్పత్తులను ప్రవేశపెట్టింది,

అక్రమ వ్యాపారం నియంత్రించేందుకు అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేసుకోవాలి

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆసియా సెక్యూరిటీ, యాంటీ కౌంటర్‌ఫీటింగ్, ట్రేడ్‌మార్క్ అండ్ బ్రాండ్ ప్రొటెక్షన్ పేరిట ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్ హెడ్ - ఇల్లీసిట్ ట్రేడ్ ప్రివెన్షన్, రోడ్నీ వాన్ డోరెన్ మాట్లాడుతూ, ఈ ముప్పును అరికట్టేందుకు, కఠినమైన నియంత్రణ, చట్టాలను జారీ చేయడంతో పాటు అక్రమ వాణిజ్యాన్ని ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సహకారం ఎలా మూలస్తంభంగా ఉంటుందో తెలిపారు. నిషేధం ఆచరణీయమైన ఎంపిక ఎలా కాదనే అంశంతో పాటు, అక్రమ వ్యాపారాన్ని అరికట్టేందుకు నియంత్రణ, అమలు పరిష్కారాలను సోదాహరణంగా వివరించారు. ఢిల్లీలో జులై 23, 24 తేదీల్లో జరిగిన రెండు రోజుల సదస్సు 'అక్రమ వ్యాపారం మరియు నకిలీలకు వ్యతిరేకంగా పోరాటంలో సహకారం మరియు ఐక్యత శక్తి' అనే అంశంపై దృష్టి సారించింది.

మద్యం బాబులకు జరిమానా

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుపడ్డ 10మంది మందుబాబులకు సోమవారం భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జ్ సౌజన్య జరిమానా విధించారు. 10 మందికి ఒక్కొక్కరికి 10 వేలు చొప్పున లక్ష రూపా యలు అపరాధ రుసుం విధించారని ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తెలిపారు.

పిల్లల అనధికార విక్రయాల ముఠాపై పోలీసులు సూక్ష్మ దృష్టితో దర్యాప్తు చేయాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పిల్లలను అనధికార విక్రయాలు జరుపుతూ పట్టుబడ్డ ముఠాపై విశాఖ నగర పోలీసులు వివిధ కోణాల్లో సూక్ష్మ దృష్టితో దర్యాప్తు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. ఈ విక్రయ సభ్యుల చేతిలోంచి పోలీసులు స్వాధీనపర్చుకున్న ఐదు నెలల చిన్నారి వివిధ అనారోగ్య కారణాల వల్ల చికిత్స పొందుతున్న కేజీహెచ్ ఆసుపత్రి పిల్లల వార్డుకు సోమవారం సీతారాం వెళ్ళి చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వైద్యాధినేత చక్రవర్తి నుండి ఆరా తీశారు. ఆమెకు మెరుగైన వైద్యం అందేలా సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం వార్డు బయటకు వచ్చిన ఆయన మాట్లాడుతూ ముందుగా ఈ కేసును ఛేదించిన నగర టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ అభినందిస్తోందని అన్నారు. ఈ కేసు వెనుకనున్న ముఠా మూలాలపై ప్రత్యేక దృష్టి నిలిపి ఎంతటివారైనా విడిచిపెట్టకుండా చట్ట ప్రకారం చర్యలు చేపట్టాల్సిందేనని ఇప్పటికే నగర పోలీసులకు తమ కమిషన్ ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. అనధికార దత్తతల వల్ల జరిగే పరిణామాలు, శిక్షలు, అపరాధ రుసుములు పైనా, అధికారిక దత్తతలు శత శాతం ఉపయుక్త ప్రయోజ నాలు పైనా అలాగే కారా చట్టం నియమ నిబంధనలపై రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ స్థాయి నుండే తాము అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామని అన్నారు. ఆసుపత్రి సందర్శనలో ఆర్.ఎం.ఓ డాక్టర్ ధవళ భాస్కరరావు, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు రమేష్, మమత, ఒన్ స్టాప్ సెంటర్ ప్రతినిధి శరణ్య, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులున్నారు.

వైసీపీకి మరో ఓటమి తప్పదు

- తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: వైసీపీకి ఎమ్మెల్సీ ఎన్నికల రూపంలో మరో దారుణమైన ఓటమి తప్పదని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రాం అన్నారు. సోమవారం దసపల్లా హెూటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి తరపున ఒకవేళ అభ్యర్థులను నిలబెట్టకపోతే నేనే పోటీ చేసి కూటమి మద్దతుతో గెలుపు బావుటా ఎగురవేస్తానన్నారు. వైసీపీ ఒక కామ పిశాచాల పార్టీ అని, ఆ జాబితాలో విజయసాయి రెడ్డితో పాటు దువ్వాడ శ్రీనివాస్ పేరు కూడా చేరిందని ఎద్దేవా చేశారు. బొత్స సత్యనారాయణను మాత్రమే కాకుండా ఆయన కుటుంబ మొత్తానికి సమూలంగా గత ఎన్నికలలో ప్రజలు చావు దెబ్బ కొట్టారన్నారు. అయినప్పటికీ ఏదో సాధించేస్తానని ఎమ్మెల్సీ ఎన్ని కలలో అభ్యర్థిగా నిలబడడం హాస్యాస్పదంగా ఉందని వ్యాఖ్యానించారు. జీవీఎంసీలో వైసీపీకి ఎటూ బలం లేదని తేలిపోయిందని, ఇక మిగిలిన ఎంపీ టీసీలు, జడ్పీటీసీలు తమ ఆత్మ ప్రబోధానికి లోబడి వైసీపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధమవుతున్నారన్నారు. వైసీపీ ఎన్ని క్యాంప్ రాజకీయాలు చేసుకున్నా ఓటమి తప్పదనే విషయాన్ని గ్రహించాలన్నారు. బొత్స సత్యనారాయణకు నిజంగా తెలివితేటలు ఉంటే.. మరో ఘోరమైన అవమానాన్ని ఎదుర్కొనే ముందే ఎమ్మెల్సీ ఎన్నికల పోటీ నుంచి తప్పుకుని విశ్రాంతి తీసుకోవాలని రామ్ సూచించారు. బైరెడ్డి దిలీప్ చక్రవర్తి స్థానికేతరుడు కావడంతో అతని అభ్యర్థిత్వాన్ని తెలుగు శక్తి వ్యతిరేకిస్తుందన్నారు. అతని బదులుగా విశాఖ నగరానికి చెందిన ఏ కార్యకర్త ఎమ్మెల్సీగా పోటీచేసినా వారికి తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

జెండా ఉంఛా రహే హమారా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజేటి బసవ కృష్ణమూర్తి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: స్వాతంత్ర్య దినోత్సవానికి ఒకరోజు ముందుగా ప్రభుత్వ మహిళా కళాశాల ఎదురుగా ఉన్న జీవీఎంసీ సెంట్రల్ పార్క్ వేదికగా 10 వేల మంది విద్యార్థులతో స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ చేపడుతున్న "జెండా ఉంఛా రహే హమారా" 25 వేల చదరపు అడుగుల త్రివర్ణ పతాక ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాజేటి బసవ కృష్ణమూర్తి అన్నారు. సోమవారం వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలను వెల్లడించారు. జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి పురస్కరించుకుని ఆగస్టు 2వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాల వేదికగా జెండా ఉంఛా రహే హమారా కార్యక్రమాన్ని ప్రారంభించామని 31వ తేదీన పాడేరులో ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సుంకరి రమణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులలో జాతీయ సమైక్యతను, దేశభక్తిని పెంపొందిస్తూ స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ చేపడుతున్న ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు యువత, విశాఖ ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. విశాఖ ఖ్యాతిని పెంపొందించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, జీవీఎంసీ సెంట్రల్ పార్క్ చుట్టూ విద్యార్థులతో త్రివర్ణ పతాక ర్యాలీ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ క్రియాశీలక కార్యవర్గ సభ్యులు గొల్ల ప్రదీప్ రాజు, కర్రి నరేష్, ఇషాక్ మొహమ్మద్, పివికె కుమార్, శివ దలై, తమ్మన విజయ్, శ్రీకాంత్, రామాయణం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయం వసతులు, వనరులను యువతరం సద్వినియోగం చేసుకోవాలని ఏయూ డాక్టర్ వి.ఎస్. కృష్ణా గ్రంథాలయం చీఫ్ లైబ్రేరియన్ ఆచార్య పి.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమంలో కీలకభూమిక పోషించిన డాక్టర్ ఎస్.ఆర్ రంగనాథన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. భారత దేశ లైబ్రేరియన్లకు ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చిన రంగనాథన్ జయంతిని జాతీయ గ్రంథాలయ దినోత్సవంగా నిర్వహించడం జరుగుతోందని వివరించారు. ఏయూలో ఐదు లక్షలకు పైగా పుస్తకాలను గ్రంథాలయం కలిగిం ఉందన్నారు. విద్యార్థులకు నిరంతరం చేరువ అయ్యే విధంగా డిజిటల్ రూపంలో కూడా పుస్తకాలు, జర్నల్స్‌ను అందుబాటులో ఉంచడం జరుగుతోందన్నారు.గ్రంథాలయ సిబ్బంది విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను వారు కోరిన విధంగా అందించాలన్నారు. గ్రంథాలయం పట్ల యువతను ఆకర్షించే విధంగా సిబ్బంది సేవలు ఉండాలన్నారు. ఈ గ్రంథాలయం ఎందరో విద్యార్థులను ఐఏఎస్, ఐపీఎస్‌లుగా, కేంద్ర ప్రభుత్వంలో ఉన్నత స్థానంలో నిలచే స్థాయికి తీర్చిదిద్దిందని గుర్తుచేశారు. గ్రంథాలయ ప్రతిష్టను పెంచే విధంగా సిబ్బంది నడచుకోవాలని సూచించారు.

20న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జిల్లావ్యాప్తంగా ఈ నెల 20న జాతీయ నులిపురుగుల నిర్మూలన, 28న మాప్ అప్ డే కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ రెండు కార్యక్రమాలపై అంగన్వాడీ కేంద్రాలు, అన్ని పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు, తల్లిదండ్రులకు ముందుగా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల లోపు వయసు గల వారు 5 లక్షల 20 వేల 891 మంది విద్యార్థులు ఉన్నారని, వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు తినిపించి శత శాతం లక్ష్యాలను సాధించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ ఏడాది ఫిబ్రవరి మాసంలో జరిగిన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో 98 శాతం లక్ష్యాలు సాధించారని, ప్రస్తుతం శత శాతం సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఇందుకోసం సుమారు 6 లక్షల మాత్రలను సిద్ధం చేసినట్లు డీఎంహెచ్ఓ తెలిపారని, కార్యక్రమానికి ముందే వాటిని సంబంధిత అధికారులు నుంచి మాత్రలను పొంది సిద్ధం చేసుకోవాలన్నారు. మాత్రలను తేమ, వెలుతురు లేకుండా భద్రపరచుకోవాలని పేర్కొన్నారు. 1-2 ఏళ్ల వయసు గల పిల్లలకు అర మాత్ర, 2-3 ఏళ్ల వయసు గల పిల్లలకు పూర్తి మాత్రను నీటిలో కలిపి తాగించాలని అన్నారు. అలాగే 3-19 ఏళ్ల వయసు గల వారికి పూర్తి మాత్రను నమిలించి మింగించాలని తెలిపారు. మాత్రను తీసుకోవడం వలన ఎటువంటి దుష్ప్రభావం ఉండబోదని, దీనివలన కలిగే ఉపయోగాలను పిల్లలకు, తల్లిదండ్రులకు అర్థమయ్యేలా వివరించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వారైతే ఎంపీడీఓల నుంచి, అర్బన్ ప్రాంతం వారైతే జోనల్ కమిషనర్ నుంచి, అంగన్వాడీ కేంద్రాలు సంబంధిత ఏఎన్ఎంల నుంచి మాత్రలను పొందాలని అన్నారు. డీఎంహెచ్ఓ, ఆర్బి ఎస్కె పీఓ, డీఈఓ, పీడి ఐసిడిఎస్, ఆర్ఐఓ ఈ కార్యక్రమానికి పర్యవేక్షణ అధికారులుగా వ్యవహరిస్తారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ డా. పి.జగన్నాథ రావు, డిఈఓ ఎల్.చంద్రకళ, డిఆర్డిఎ పీడి ఎం. శోభారాణి, ఐసిడిఎస్ పీడీ డా. జి.జయదేవి,బిసీ సంక్షేమం, సాంఘిక సంక్షేమ శాఖాధికారులు కె.శ్రీదేవి, కె. రామారావు, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.